## బస్టాండ్‌లో ఫుల్ రష్



మంగపేట : వనదేవతలు గద్దెలపై కొలువుదీరడంతో భక్తజనంతో మేడారం పోటెత్తింది. దీంతో బస్టాండ్ ప్రాంతం కిక్కిరిసింది. జాతరకు వచ్చే భక్తులు, దర్శనం చేసుకొని తిరిగి వెళ్లే వారితో మేడారం బస్టాండ్, సమీప ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. దర్శనం ముగించుకొని బస్టాండ్‌కు చేరుకున్న భక్తులు చాలామంది ప్రయాణ ప్రాంగణంలో విశ్రాంతి తీసుకుంటూ కనిపించారు. దీని వల్ల అక్కడ రద్దీగా పెరగడంతో బస్టాండ్‌కు వచ్చిన భక్తులు తమ తమత ప్రాంతాలకు వెళ్లాలని మైక్‌లో సూచిస్తున్నారు. ఆర్టీసీ, పోలీసు సిబ్బంది భక్తులను క్యూలైన్ల ద్వారా వారు వెళ్లే బస్సుల్లోకి పంపిస్తున్నారు. ఇందుకోసం వందలాది మంది ఆర్టీసీ సిబ్బందికి తోడుగా, ఓ ఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో నలుగురు డీఎస్పీలు, 56 మంది ప్రొబేషనరీ ఎస్సైలు, పలువురు పోలీసు సిబ్బంది, హోంగార్డులు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో విధులు నిర్వర్తిస్తున్నారు.

## తిరుగు పయనం..



### ఖాళీ అవుతున్న మేడారం

ఏటూరునాగారం : మూడు రోజుల పాటు మేడారంలో విడిది చేసిన భక్తులు శుక్రవారం ఉదయం నుంచి తిరుగు పయనమయ్యారు. సమ్మక్క-సారలమ్మ గద్దెలపై కొలువుదీరిన తర్వాత మొక్కులు చెల్లించుకున్న లక్షలాది మంది ఇంటిబాట పడుతున్నారు. మూట, ముల్లె సర్దుకుని వెళ్లిపోతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో కొందరు, ట్రాక్టర్లు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో మరికొందరు భక్తులు బయల్దేరుతుండడంతో క్రమంగా గుడారాలు ఖాళీ అవుతున్నాయి. పలువురు చిరు వ్యాపారులు కూడా సామాన్లు సర్దుకుంటున్నారు. జంపన్నవాగు, రెడ్డిగూడెం, కొంగల మడుగు, ఊరట్టం, కన్నెపల్లి, నార్లాపూర్, ఎలుబాక పరిసరాలు భక్తుల్లేక వెలవెలబోతున్నాయి. బస్టాండ్‌కు వెళ్లే భక్తుల నుంచి ఆటోవాలాలు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. మొత్తానికి గత నెల రోజుల నుంచి మేడారానికి భక్తుల రాక మొదలుకాగా శుక్రవారం నుంచి ఖాళీ అవుతుండడంతో జాతర పరిసరాలు కాస్త బోసిపోయి కనిపించాయి.





మేడారంలో ప్రత్యేకాధికారులతో వనజీవి రామయ్య

## చంటి పిల్లలకు ఎంత కష్టం..!



వాజేడు : శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి మేడారానికి వచ్చిన సమయంలో గంటల తరబడి సామాన్య భక్తులకు దర్శనం నిలిపివేశారు. దీంతో క్యూలో ఉన్న చంటిపిల్లలు, వారి తల్లులు అవస్థలు పడ్డారు. పిల్లలకు కనీసం పాలు ఇవ్వడానికి కూడా అవకాశం లేక, బయటకు వెళ్లే ప్రయత్నం చేసినా పోలీసులు కనికరించక తీవ్ర ఇబ్బందిపడ్డారు. ఒక దశలో పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగారు.



దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఫొటోలు

నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్లు

గొట్టె వెంకన్న

మేరుగు ప్రతాప్

బండ మోహన్

కోరె అరవింద్



జంపన్న వాగులో చిన్నారుల జలకాలాటలు

మొక్కులు చెల్లించుకొని ముల్లెమూటతో ఎడ్లబండ్లు, వాహనాల్లో తిరుగు పయనమైన భక్తులతో కిటకిటలాడుతున్న జంపన్న వాగు